సందడిగా భోగి

- ఆడిపాడిన చిన్నాపెద్ద
- నేడు సంక్రాంతి సంబరాలు


గంగిరెద్దు విన్యాసాలు చూస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్


డూడూ బసవన్న సందడి


సీతారామరాజునగర్ పార్క్ వద్ద భోగి మంట చుట్టూ డ్యాన్సులు

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గంలో భోగి పండగను శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అంతా ఉత్సాహంగా గడిపారు. నాలుగు రోజుల నుంచి వివిధ ప్రదేశాల్లో సేకరించిన పాత చెక్క ముక్కలు, అట్టపెట్టెలు, కర్రలను ఒక చోట ఉంచి వాటికి నిప్పు పెట్టి సరదాగా గడిపారు. భోగ భాగ్యాల భోగి పండగ గోపాలపట్నం ఎన్ఏడీ ప్రాంతాల ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ప్రతీ వీధిలో ఇంటికో భోగి మంట దర్శనమిచ్చింది. అపార్ట్‌మెంట్ వాసులు చాలా మంది వారి ముంగిట భోగి మంట వేసి సంప్రదాయ దుస్తులతో మంటల్ని కాగారు. ఏపీఎస్ఈబీ కాలనీలో ఒక కుటుంబం భోగి మంట చుట్టూ సంప్రదాయ నృత్యాలు చేశారు. ఈ దృశ్యం వినోదాత్మకంగా సాగింది. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఇంటి వద్ద భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా ఇంటికి వచ్చిన గంగిరెద్దుల విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. సింహాద్రి అన్న రూపుగా చెప్పుకునే గంగిరెద్దు ఆయన కుటుంబాన్ని ఆశీర్వదించింది. ఎన్ఏడీ శివాలయం వద్ద భారీ భోగి మంట వేశారు.

పారిశ్రామిక వాడలో..

మల్కాపురం: పారిశ్రామిక వాడలో భోగి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. మల్కాపురం పల్లివీధి వద్ద చిన్నారులు పెద్ద మంట వేశారు. ఇదే ప్రాంతానికి చెందిన మరి కొంత మంది యువత మంట వేసి,డీజే సాంగ్స్ పెట్టి నృత్యాలు చేస్తూ సరదాగా గడిపారు.


మల్కాపురంలో భోగి మంట వద్ద చిన్నారులు


పల్లివీధి వద్ద భోగి మంట వేసిన చిన్నారులు


ఏపీఎస్ఈబీ కాలనీ ప్రధాన రహదారిలో భోగి మంట వద్ద స్థానికుల సందడి

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు


పోటీల్లో పాల్గొన్న చిన్నారులు, యువత

సింహాచలం: సింహగిరిపై స్వధర్మ వాహిని ఆధ్వర్యంలో శనివారం ఆలయ రాజగోపురం వద్ద ఉన్న కళావేదికపై గోదాదేవి అలంకరణ పోటీలు నిర్వహించారు. చిన్నారులు, యువతులు గోదాదేవి అలంకరణలో ఆకట్టుకున్నారు. విజేతలకు దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ నగదు బహుమతులు అందజేశారు. అలాగే సింహగిరిపై శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు, అధికారులు బహుమతులు అందజేశారు. ఎన్ఏడీ కొత్తరోడ్డుకి చెందిన కె.నాగమణి ప్రథమ బహుమతి పొందగా, శ్రీనివాసనగర్‌కు చెందిన కె.సౌమ్య, మద్దిలపాలేనికి చెందిన ఎస్.సువర్ణ ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచారు. సింహగిరికి వచ్చిన భక్తులకు సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు ఆధ్వర్యంలో బూరెలు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

నిర్లక్ష్యంగా చెత్త పారబోత


మల్కాపురం పల్లి వీధి సర్వీసు రోడ్డుపై పారబోసిన వ్యర్థాలు

మల్కాపురం: ఈ నగరం మనది.. మన నగరాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దుకుందామని అధికారులు ఎంత అవగాహన కల్పిస్తున్నా.. కొంతమంది పెడచెవిన పెడుతున్నారు. తడి-పొడి చెత్త సేకరణకు వీధుల్లోకి వాహనాలు వస్తున్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చెత్త పారబోతతో సర్వీస్ రోడ్లను డంపింగ్ యార్డులుగా మారుస్తున్నారు. నిత్యం రాకపోకలు సాగించే మార్గంలో వ్యర్థాలు వేస్తున్నారు. ఇలాగైతే జీవీఎంసీ లక్ష్యం ఎలా నెరవేరుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నిరసన

మల్కాపురం: ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 61వ వార్డు ప్రకాష్‌నగర్ ఏడుగుడుల సెంటర్ వద్ద టీడీపీ నాయకులు శనివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మజ్జి సోమేష్,నీలాపు జోగి,సర్వసిద్ధి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బ్రేక్ డ్యాన్స్ నేషనల్ చాంపియన్‌గా చైతన్య


ధ్రువపత్రాన్ని అందుకుంటున్న చైతన్య

సీతంపేట: నేషనల్ లెవెల్ బ్రేక్ డ్యాన్స్ పోటీలో అక్కయ్యపాలేనికి చెందిన పెంటకోట చైతన్య అద్భుత ప్రతిభతో విన్నర్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. చెన్నైలోని ఐఐటీ మద్రాస్ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన జాతీయ స్థాయి ఒరిజినల్ స్ట్రీట్ డ్యాన్స్ పోటీల్లో అండర్ 16 స్థాయిలో 30 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నం నుంచి పాల్గొన్న చైతన్య మొదటి స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్‌ను సాధించాడు. 2018లో మొదటి సారి పోటీల్లో అడుగుపెట్టిన చైతన్య ఐదేళ్ల కఠోర శిక్షణ తర్వాత నేషనల్ చాంపియన్‌షిప్ దక్కించుకున్నాడు. ఎంవీపీలోని డిస్నీ బ్రేకర్స్ ఇంటర్నేషనల్ డ్యాన్స్ స్కూల్‌లో సోహైల్ సింగ్ వద్ద బ్రేకింగ్ డ్యాన్స్‌లో శిక్షణ పొందుతున్నాడు.

రైళ్ల రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ నుంచి శనివారం రాత్రి బయలుదేరాల్సిన పలు రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఆయా స్టేషన్ల నుంచి పెయిరింగ్ రైళ్లు విశాఖకు ఆలస్యంగా రావడంతో రీషెడ్యూల్ చేశామన్నారు.

- శనివారం రాత్రి 10 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం-న్యూఢిల్లీ(20805) ఏపీ ఎక్స్‌ప్రెస్ ఆదివారం తెల్లవారు 3 గంటలకు బయలుదేరింది.
- శనివారం రాత్రి 11.25 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినస్(18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ మధ్య రాత్రి 1 గంటకు బయలుదేరింది.

ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు..

సికింద్రాబాద్ డివిజన్ సులేహళ్లి స్టేషన్ పరిధిలో గూడ్స్ రైలు పట్టాలు తప్పిన కారణంగా శనివారం మధ్య రాత్రి విశాఖలో బయలుదేరే విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినస్(18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ మళ్లించిన మార్గంలో వయా వాడి, కాలాబురాగి, హోమ్నాబాద్, బీదర్, వికారాబాద్ స్టేషన్ల మీదుగా నడుస్తుంది.

రైతుబజార్లలో సంక్రాంతి సరకులు


కంచరపాలెం రైతుబజార్‌లో విక్రయిస్తున్న కూరగాయలు

కంచరపాలెం: సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు తెలుగు వారి కుటుంబాల్లో సందడే సందడి. మకర సంక్రాంతిలో పితృదేవతలకు మొక్కులు చెల్లించడమే ప్రధానం. ఇందుకోసం నైవేద్యంగా స్వయంపాకాన్ని పురోహితుడికి అందివ్వడం ఆనవాయితీ. సంక్రాంతి ఫలహారాలు, కూరగాయలు ఈ పండగ రోజుల్లో ఇబ్బడిముబ్బడిగా ఇళ్లల్లో కనిపిస్తాయి. ఇళ్లన్నీ బంధువులతో కళకళలాడుతాయి. ఇందుకోసం పెద్దెత్తున కూరగాయలు అవసరం. దీనిని దృష్టిలో ఉంచుకొని నగరంలో రైతు బజార్లలో పెద్ద ఎత్తున కూరగాయలు సిద్ధం చేశారు. దేవ గుమ్మడి, చెరుకు గడలు, కూర పెండలం, చిలగడ దుంపలు, రోజు కనిపించే కూరగాయలు, ఆకుకూరలు పెద్ద సంఖ్యలో మార్కెట్‌కు తెచ్చారు. ఈ కాలంలో దొరికే ఇటువంటి కూరగాయలు కొనడానికి వినియోగదారులు ఇష్టపడుతుంటారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతాలైన అరకు, కేడీపేట, నర్సీపట్నం, సబ్బవరం, కొత్తవలస, దేవరాపల్లి, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన దుంపలు, చెరుకు గడలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కంచరపాలెం రైతుబజార్ శనివారం వినియోగదారులతో కళకళలాడింది. కూరగాయల విక్రయాలు జోరుగా సాగాయి.

శోభన్‌బాబుకు సేవా నివాళి


శోభన్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

కంచరపాలెం: సమాజ సేవలో భాగస్వాములవుదామని సిటీవైడ్ శోభన్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సీనియర్ అభిమాని ఒమ్మి వెంకటరమణ పిలుపునిచ్చారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రామ్మూర్తిపంతులుపేటలో దివంగత సినీ దిగ్గజం శోభన్‌బాబు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన కేక్ కట్‌చేసి మాట్లాడుతూ సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. శోభన్‌బాబు చిత్రంతో కూడిన కొత్త ఏడాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముందుగా శోభన్‌బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గువ్వల వెంకటరమణ యాదవ్, కొణతాల వెంకటరావు, కె.శోభనబాబు, జి.నాగరాజు, కిలాని అప్పలరాజు, కె.సత్యనారాయణ, బి.కుమార్, డి.విజయ్‌కుమార్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు .. ఆంధ్రుల హక్కు


పోస్టర్ ప్రదర్శిస్తున్న చిన్నారులు

మల్కాపురం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని.. ఎంతో మంది ప్రాణత్యాగాల ఫలితం విశాఖలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కారణమైతే.. వారి త్యాగాన్ని పక్కన పెట్టి కేంద్రం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి సిద్ధమవడం దుర్మార్గమని సీఐటీయూ మల్కాపురం జోన్ నాయకుడు పైడిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ 61వ వార్డు పరిధిలో శనివారం ఉదయం ప్లకార్డులతో చిన్నారులతో కలిసి నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నష్టాల్లో ఉందని సాకు చూపి దాన్ని బడాబాబుల చేతిలో పెట్టేందుకు ప్రధాని నరేంద్రమోదీ యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి చెందిన ఆస్తులను ప్రైవేట్ వారికి ధారదత్తం చేయడానికి వారు ఎవరిని ప్రశ్నించారు. నాయకుడు అంటే ప్రజల ఆస్తులు కాపాడి,వారికి కష్టం వచ్చినప్పుడు అండగ నిలబడాలే తప్పా ఇలా వ్యవహరించకూడదన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంటారావు,జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. మకరజ్యోతి దర్శనం


విశేషాలంకరణలో అయ్యప్పస్వామి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మకరజ్యోతిని మాలధారులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. మకర జ్యోతి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉక్కునగరం అయ్యప్ప ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అష్టాభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయంలో 18 మెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామికి సంధ్యా హారతి పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో పడి మెట్ల వద్ద దీపాలు వెలిగించి, చివరి మెట్టు ధ్వజ స్తంభం వద్ద సాయంత్రం 6.45 గంటలకు మకర జ్యోతి దర్శనం కల్పించారు. అయ్యప్ప మాలధారులతో పాటు సాధారణ భక్తులు కూడా జ్యోతిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మంచు కురిసే వేళలో..


గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద పొగమంచు


గోపాలపట్నం రైల్వే స్టేషన్‌కు వెళ్లే దిగువ రోడ్డులో కమ్ముకున్న పొగమంచు


ఎన్ఏడీ జంక్షన్ రైల్వే బ్రిడ్జ్ వద్ద..

గోపాలపట్నం: గోపాలపట్నం, ఎన్ఏడీ పరిసర ప్రాంతాలను పొగ మంచు కప్పేసింది. ఉదయం 9 గంటల వరకు మంచు ప్రభావం తగ్గలేదు. భోగి పండగ కావడంతో వేకువ జాము నుంచే మంటలు వేయడానికి వచ్చిన వారు మంచును ఆస్వాదించారు. మంచు కురిసే వేళలో అంటూ సందడి చేశారు. గోపాలపట్నం నుంచి రైల్వే స్టేషన్ రోడ్డులో పొగమంచు దట్టంగా కురిసింది. పదడుగుల దూరంలో ఎదురుగా వస్తున్న వాహనం సైతం కనిపించని విధంగా పొగమంచు ఆవరించింది. ఉదయం 10 గంటల వరకు ఇదే పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు.

మరో సైబర్ క్రైం

- ఓ వ్యక్తి ఖాతా నుంచి
- రూ. 1.62 లక్షలు మాయం

అల్లిపురం : అప్పు తీసుకుని పూర్తిగా తీర్చేసినా లోన్‌యాప్ ద్వారా సదరు వ్యక్తిని దోచుకున్న మరో ఘటన విశాఖలో చోటు చేసుకుంది. సైబర్ క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో ఆరిలోవ ప్రాంతానికి చెందిన వ్యక్తి సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం పెకిఫర్ లోన్ యాప్ నుంచి డబ్బు తీసుకున్నాడు. కాలపరిమితిలోగా ఆ అప్పును తీర్చేసాడు కూడా. అయినప్పటికీ ఆ కంపెనీ నుంచి ముకేష్ అనే వ్యక్తి ఫోన్ చేసి డిసెంబర్ ఈఎంఐ బ్యాలెన్స్ ఉందని.. డబ్బు కట్టాలని చెప్పాడు. తాను ఇది వరకే ఈఎంఐ చెల్లించానని సదరు వ్యక్తి చెప్పాడు. మీరు చెల్లించింది అప్‌డేట్ కాలేదని, ఫోన్ పేలోకి వెళ్లి యూపీఐ నంబర్‌కి తాము చెప్పిన కోడ్ ఎంటర్ చేయమని లోన్‌యాప్ వ్యక్తి తెలిపాడు. దీంతో బాధితుడు అతను చెప్పిన నంబరు ఎంటర్ చేశాడు. అంతే.. బాధితుడి అకౌంట్ నుంచి రూ.1,62,821 మాయమైపోయాయి. దీంతో బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

సింహగిరిపై ముగిసిన ధారోత్సవాలు

సింహాచలం: సింహగిరిపై ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ధారోత్సవాలు శనివారంతో ముగిసాయి. వరాహలక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవి,గోదాదేవిని ఒక పల్లకిలో, మదన గోపాలస్వామిని వేరొక పల్లకిలో అధిష్టంపజేశారు. సువర్ణ అమ్మవారిని, చతుర్భుజ తాయారు అమ్మవారు, ఆళ్వారులను మరో పల్లకిలో వేంచేయజేశారు. మేళతాళాల మధ్య ఆలయంలో నుంచి తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై విశేషంగా స్నపనం నిర్వహించారు. అనంతరం గంగధార వద్ద ఉన్న ప్రాచీన మండపంలో స్వామిని,అమ్మవార్లను అధిష్టంపజేసి విశేష అలంకరణ చేశారు. ముప్పెవై పాశుర విన్నపం చేశారు.

'స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తే సహించం'


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రగతి పథంలో నడుస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కావాలనే నిర్వీర్యం చేస్తున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాంట్ జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 702వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని ఎల్ఎంఎంఎం మరియు ఎస్‌బీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ గతేడాది కరోనా సమయంలో 28వేల కోట్లు టర్నోవర్ చేసిన సంస్థను ఈ ఏడాది ముడి సరుకు అందించకుండా చేసి 1300 కోట్లు నష్టాల వైపు నెట్టారని విమర్శించారు. ఐక్య ఉద్యమాలతో ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామన్నారు. కార్యక్రమంలో వై.మస్తానప్ప, కె.భాస్కరరావు, సీహెచ్. సన్యాసినావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!


కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న క్రైం పోలీసులు

మల్కాపురం: సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లే వారు తగు జాగ్రత్తలు పాటించాలని క్రైం పోలీసులు సూచించారు. మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆటోలు, కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. ఆర్కే పురంలోని హెచ్‌పీ మిలీనియం క్లాసిక్ పెట్రోల్ బంక్ వద్ద వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఊరెళ్తున్నట్టు సోషల్ మీడియా ద్వారా ఎవరికీ సమాచారం షేర్ చేయవద్దన్నారు. ఇంట్లో విలువైన ఆభరణాలు, నగదును ఉంచవద్దని చెప్పారు. ఇంటి చుట్టుపక్కల ఎవరైనా అనుమానితులు సంచరిస్తూ కనిపిస్తే తక్షణం 100కు ఫోన్ చేయాలన్నారు. అనంతరం గుల్లలపాలెం మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్, కోరమాండల్ బస్టాప్, జనతా కాలనీ తదితర ప్రాంతాల్లో పోలీసులు ప్రచారాలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

కమనీయం.. గోదాదేవి కల్యాణం


నగరాల వీధిలో గోదాదేవి కల్యాణం పూజలు


తిక్కవానిపాలెం వేంకటేశ్వరాలయంలో గోదాదేవి కల్యాణం చేస్తున్న అర్చకులు


సింహగిరిపై స్వామికి యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

కంచరపాలెం: కంచరపాలెం శ్రీకృష్ణ సేవా సమాజం(యాదవ్), శ్రీరామా సేవా సమాజం యాదవ్ గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో సీతారామాలయం, శ్రీకృష్ణ మందిరంలో గోదారంగనాథుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస ముగింపు పూజలు చేశారు. తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వరాలయంలో గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవ రావు ఆధ్వర్యంలో అర్చకులు చామర్తి జగన్నాథశర్మ, శంకరశర్మ గోదారంగనాథుల కల్యాణం ఘనంగా జరిపారు. వరాహ లక్ష్మీనరసింహ స్వామి సేవ గరిడి సంఘం ఆధ్వర్యంలో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. గరిడీ తాళాలు, కంచు బెత్తులతో నృత్యాలు చేస్తూ వీధుల్లో పర్యటించారు. కంచరపాలెం ప్రాంతాల్లో తోడపెద్దును ఊరేగిస్తూ బియ్యం, పప్పు, నూనె తదితర సామగ్రిని సేకరించారు.

ఆలయాలకు భక్తుల తాకిడి

మల్కాపురం: భోగి సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు ఆలయాల్లో గోదాదేవి పూజలు ఘనంగా జరిపారు. మల్కాపురం నగరాలవీధి రామాలయంలో జరిగిన గోదాదేవి కల్యాణంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం దంపతులు పూజలు చేశారు. గొల్లవీధిలోని కృష్ణాలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు జరిపారు.

- స్థానిక ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువు దీరిన శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు.

సింహగిరిపై..

సింహాచలం: సింహగిరిపై గోదా రంగనాథుల కల్యాణం శనివారం సాయంత్రం కనుల పండువగా జరిగింది. వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీకృష్ణుడిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్టంపజేశారు. గోదాదేవి అమ్మవారిని మరో పల్లకిలో వేంచేయజేసి మాడ వీధుల్లో తిరువీధిగా తీసుకెళ్లి ఎదురు సన్నాహోత్సవం విశేషంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణమండపంలో స్వామి, అమ్మవార్లను అధిష్టంపజేసి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కల్యాణం నిర్వహించారు. కాగా ఎదురు సన్నాహోత్సవంలో అర్చకులు పూలదండలతో నృత్యాలు చేస్తూ అలరించారు. పలువురు కళాకారులు గోదాదేవి, శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు.